




డిప్యూటీ సిఎంకు బీపీ చెక్ చేస్తూ...

బియ్యం ధరలకు రెక్కలు



26 కిలోల బస్తా రూ.1450

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

సహజంగా చుక్కలు ఆకాశంలో కనిపిస్తాయి.. అయితే సామాన్యుడికి చుక్కలు నేలపై కనిపిస్తున్నాయి.. అదేంటి అనుకుంటున్నారా.. బియ్యం ధరలకు రెక్కలొచ్చి సామాన్యుడికి బతుకు జీవనం భారమయ్యింది. గ్యాస్, వంటనూనె, పప్పుధాన్యాలు, కూరగాయలతో పాటు బియ్యం ధరలూ మార్కెట్లో పెరిగిపోయాయి. వంటింటి బడ్జెట్‌పై ప్రభావం చూపుతోంది.

ప్రధానంగా సన్నరకం బియ్యం ధరలు కిలో 54రూపాయలకు చేరుకోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. రైతు గడప దాటిన తరువాత ధాన్యం ధర అమాంతం పెరిగి బియ్యం రూపంలో రెక్కలొస్తున్నాయి. వ్యాపారులు, మిల్లర్లు పెద్దఎత్తున ధాన్యాన్ని నిల్వచేసి కృత్రిమ కొరత సృష్టించి ధర పెంచేస్తున్నారు. తిరుపతి జిల్లా ప్రాంతంలో ధాన్యం వ్యాపారులు వేల బస్తాలను నిల్వచేసి ఇపుడు మర పట్టించి బియ్యం విక్రయిస్తున్నారు. గత ఏడాది ఖరీఫ్ పంట కోత దశలో ధాన్యం వర్షాలకు దెబ్బతినడం, సన్నరకాల ఎగుమతులు బాగుండడంతో ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు 76 కిలోల బిపిటి ధాన్యం బస్తా రూ.2350 నుంచి, 2500 వరకూ ధర పలుకుతోంది. బిపిటితో పాటు మరో రెండు రకాల సన్నబియ్యం ధాన్యానికి డిమాండ్ ఉంది. రబీలో ప్రస్తుతం వస్తున్న ధాన్యాన్ని ఆవిరి ద్వారా తేమశాతం తగ్గించి మర పట్టించినవి కిలో రూ.42కు విక్రయిస్తున్నారు. పాత బియ్యానికి డిమాండ్ ఉండడంతో కొందరు ఆవిరితో మర పట్టించిన బియ్యాన్ని కలిపి విక్రయిస్తున్నారు.ఒకే రకమైన బియ్యాన్ని వివిధ బ్రాండ్ల పేరుతో ఆకర్షనీయమైన సంచుల్లో నింపి ధరలు పెంచి అమ్మేస్తున్నారు.

మార్కెట్లో బియ్యం విక్రయిస్తున్న కంపెనీలు పన్నుల నుంచి ఉపశమనం పొందడానికి 26కిలోలు, 30కిలోల బస్తాలను అందుబాటులోకి తెచ్చాయి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 25కిలోల వరకు బ్రాండ్లతో అమ్ముతున్న బియ్యానికి పన్ను వసూలు చేస్తున్నారు. 25 కిలోలు దాటితే పన్ను ఉండదు. దీనిని దష్టిలో ఉంచుకుని వ్యాపారులు 26లోల బస్తాలను విక్రయిస్తున్నారు. 26కిలోల సన్నబియ్యం బస్తా ధర రూ.1400 నుంచి 1450 వరకు టోకుగా మార్కెట్ చేస్తున్నారు. చిల్లర దుకాణాల్లో కిలోల లెక్కన తీసుకుంటే వీటి ధర మరింత పెరుగుతోంది. టోకు గా కిలో రూ. 54 ధర పడుతోంది. కరోనా ముందు నుంచి పాత బియ్యం ధర కిలో రూ. 48 ఎక్కువ రోజులు కొనసాగింది. గత డిసెంబరు నుంచి నెలకు రూ.2 చొప్పున పెరుగుతూ కిలో రూ.54 కు చేరింది. గతేడాది ధాన్యం వర్షం వల్ల దెబ్బతిందని, నిల్వలు లేవని వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు జిల్లాలో పండిన సన్నరకాల ధాన్యంలో 55 శాతం వరకు తమిళనాడుకు రవాణా అయింది. చిత్తూరు నెల్లూరు ప్రాంతం నుంచి కొంత తెలంగాణలోని మిర్యాలగూడ మిల్లర్లు కొనుగోలు చేసి విదేశాలకు ఎగుమతి చేశారు. హైదరాబాద్, విశాఖపట్టణం వంటి నగరాలకు జిల్లా నుంచి సన్నబియ్యం రవాణా అవుతున్నాయి. వీటన్నిటి ప్రభావంతో గత పదేళ్లలో లేనంతగా రికార్డుస్థాయిలో ధరలు పెరిగాయని మార్కెట్‌వర్గాలు చెబుతున్నాయి. ప్రతి కుటుంబం సగటున నెలకు 26కిలోల బస్తా కొనుగోలు చేయాల్సి రావడంతో నెలకు రూ.200 వరకు అదనంగా వెచ్చించాల్సి వస్తోంది. సన్నరకాల ధాన్యం ధరలు పెరగడంతో మిగతా రకాల ధరలు కూడా పెరిగాయి. కొత్తగా వస్తున్న స్టీమ్ రైస్ రూ.42 పలుకుతోంది. బియ్యం ధరలు పెరగ డంతో వాటి ఉప ఉత్పత్తులు నూకలు, తవుడు ధరలు పెరిగాయి. వీటిమీద ఆధారపడిన దాణా తయారీ యూనిట్లపై పడిన భారాన్ని తాజా కొనుగోలుదారులకు బదలాయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాల్లో వ్యాపారులు పెద్దఎత్తున నిల్వచేసిన ధాన్యాన్ని మార్కెట్లోకి తీసుకురాగలిగితే ధరలు అదుపు చేయవచ్చు.

మీ ఇంటి ముంగిటకే ... మీ 'ఫ్యామిలీ డాక్టర్'

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు వారి ముంగిట అమలవుతున్న 'ఫ్యామిలీ డాక్టర్' విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ప్రయోగాత్మకంగా గురువారం ప్రారంభించారు. తిరుపతి జిల్లా పుత్తూరు మండలం తడుకు గ్రామం నుంచి ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డితో కలిసి ప్రారంభించారు. నారాయణస్వామి మాట్లాడుతూ డాక్టర్, నర్సులు అంటే వారు దేవుళ్ళు, దేవతలతో సమానమని అన్నారు. విద్యా, వైద్యం అభివద్ధి చేస్తే విద్య ద్వారా మెరుగైన జీవితం ఉంటుందని నమ్మిన వ్యక్తి మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని కొనియాడారు. కులాన్ని మతాన్ని చూడకుండా రాష్ట్రాన్ని అభివద్ధి చేస్తున్నారని అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ముఖ్యమంత్రి భారత దేశంలోనే అత్యంత ప్రాధాన్యత వినూత్నమైన వైద్య విధానాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానం అనే మహోన్నత కార్యక్రమాన్ని జిల్లాలో పూర్తిస్థాయిలో అమలయ్యేలా చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామంలో వైద్యం అందుబాటులో ఉండేలా ప్రతి రెండువేల మందికి వైఎస్ఆర్ విలేజి క్లినిక్‌ల ఏర్పాటుతో, ప్రజల గడప వద్దకే వైద్యం అందిస్తామన్నారు. జిల్లాలోని 439 విలేజి హెల్త్ క్లినిక్‌ల పరిధిలోని సచివాలయాలను కవర్ అయ్యేలా, ప్రతి సచివాలయ పరిధిలో నెలకు రెండుసార్లు 104 వాహనాలు పర్యటించి వైద్యసేవలు అందిస్తున్నాయన్నారు. విలేజి హెల్త్ క్లినిక్‌లో 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. హెల్త్ ఐడితో కేంద్ర ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌కు అనుసంధానమై పూర్తి సమాచారం ఎక్కడైనా ఆన్‌లైన్‌లో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ శ్రీహరి, డిసిహెచ్‌ఎస్ ప్రభావతి, తహశీల్దార్ రోశయ్య, ఎంపిడిఒ ఇందిర, ఎంపిపి మునివేలు, సర్పంచి వెంకటేష్, డాక్టర్ హనుమంతరావు పాల్గొన్నారు.

సత్యవేడులో... ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అవగాహనా సదస్సులో జడ్‌పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. గురువారం దాసుకుప్పం పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఆమె మాట్లాడుతూ కుటుంబ డాక్టర్ విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందన్నారు. సాధారణ జబ్బులతో పాటు చిన్నపిల్లలు, గర్భిణీలకు వైద్యసేవలు అందిస్తామన్నారు. వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ, మండల పరిషత్ పరిపాలనాధికారి రమణకుమార్ పాల్గొన్నారు. **బాలాయపల్లిలో...**ఎంపిపి గూడూరు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. పేద ప్రజలు వైద్యం కోసం డాక్టర్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, మీ ఇంటి వద్దకే వైద్యులు వస్తారని చెప్పారు. పేషంట్‌కు, డాక్టర్‌కు మధ్య స్నేహబంధం ఏర్పడితే మానసికంగా పేషంట్ కోలుకుంటాడన్నారు. ఈ కార్యక్రమంలో జయంపు సహకార సంఘం అధ్యక్షులు వెందోటి కార్తీక్‌రెడ్డి, వైద్యాధికారి కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు. **వాకాడులో...** జెమిని కొత్తపాలెంలో సొసైటీ ఛైర్మన్ కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి, ఎంపిడిఒ గోపీనాథ్, వైస్ సర్పంచి కిరణ్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ కమలారాణి పాల్గొన్నారు. **బిఎన్ కండ్రిగలో...** ఎంపిటిసి రవి ఆధ్వర్యంలో కాటూరులో ప్రారంభించారు. వైద్యాధికారి మాధవి, దివాకర్ పాల్గొన్నారు. **నాగలాపురంలో..** ఫ్యామిలీ డాక్టర్ పేద ప్రజలకు వరమని ఎంపిపి సింధు శ్యామన్ అన్నారు. వైద్యాధికారి నాగరాజు ఆధ్వర్యంలో రాజీవ్‌నగర్‌లో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మీ స్థలాల్లో ఇళ్లు కట్టుకోండి..!

ఇదే శెట్టిపల్లి సమస్యకు శాశ్వత పరిష్కారం
భూబాధితులకు వామపక్ష నేతల భరోసా

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

దశాబ్దాల కాలంగా సొంత ఇంటి కలలు నెరవేర్చుకోవడానికి దాదాపు 3,500 మంది పేదలు రైతులు వద్ద నుండి అప్పులు చేసి, కష్టించి సంపాదించుకున్న సొమ్ముతో ప్లాట్లు కొనుక్కొని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, అయితే ఇళ్ల నిర్మాణం చేయకూడదని ప్రభుత్వం అడ్డు చెప్పడం, పరిష్కారం చూపకపోవడం దారుణమని, ఇకపై పేదల ఇంటి నిర్మాణానికి ఎవరి అనుమతి అవసరం లేకుండా ఇల్లు నిర్మించుకోవాలని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ శెట్టిపల్లె భూ బాధితులకు భరోసా ఇచ్చారు. గురువారం మంగళం పరిధిలోని శెట్టిపల్లి స్థలాల్లో సిపిఎం, సిపిఐ నేతలతో కలిసి నారాయణ శెట్టిపల్లె స్థలాలను పరిశీలించారు. పేదలు కష్టించి కొనుగోలు చేసిన భూములను మేం పంచుకుంటాం అని వ్యవహరిస్తున్న ప్రభుత్వ తీరు ఆక్షేపణీయమన్నారు. శెట్టిపల్లి భూ బాధితులు ఎవరికి భయపడనవసరం లేదని, వామపక్షాలుగా తాము ముందుండి ఇళ్ల నిర్మాణాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తిరుపతి రూరల్‌లో ఉన్న శెట్టిపల్లి ప్రాంతాన్ని నగరపాలక సంస్థలో విలీనం చేశారని, రూరల్ లో ఉంటే ఒక నాయకుడి పెత్తనం, అర్బన్‌లో ఉంటే మరొక నాయకుడు పెత్తనం, పేదలు కొనుక్కున్న స్థలాలను దోచుకోవాలని కొందరు చూస్తుంటే వారికి ప్రభుత్వం అండగా నిలబడుతుందా అంటూ ప్రశ్నించారు. శెట్టిపల్లి భూములను అభివద్ధి చేయడానికి ముందు తుడాకు అనుమతి ఇచ్చారని, ఇప్పుడేమో నగరపాలక సంస్థ పరిధిలోకి తీసుకున్నారని, ప్లాట్లు కొనుగోలు చేసిన వారు వారి స్థలాల్లో ఇల్లు నిర్మాణం చేసుకుంటారని, మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ పేరుతో శెట్టిపల్లి గ్రామస్తులను, శెట్టిపల్లి ప్లాట్ల కొనుగోలుదారులను ఇబ్బందులకు గురి చేస్తూ ఆందోళన వాతావరణం నెలకొల్పిందని, అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి ఆనాడు ప్రతిపక్ష నాయకుడిగా శెట్టిపల్లి భూ బాధితులకు న్యాయం చేస్తామని వారి ప్లాట్లు వారికి ఇచ్చేలా అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా ఏ చర్యకూ ఉపక్రమించకపోవడం బాధితులకు అన్యాయం చేయడమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీరు శాసనమండలి ఎన్నికలతోనైనా మారుతుందనుకుంటే ఇప్పటికీ వంచన నిర్ణయాలు తీసుకుంటున్నారని, గతంలో పేదలకు రెండు సెంట్లు భూమి ఇస్తామని ప్రకటించి ఇప్పుడు ఒక సెంటుకు పరిమితమైందన్నారు. కొనుక్కుని రిజిస్ట్రేషన్ చేసుకున్న భూములపై రాష్ట్ర ప్రభుత్వ జోక్యం అవసరం లేదని, శెట్టిపల్లి భూ బాధితులు ధైర్యంగా తమ రికార్డులు తీసుకొచ్చి ఇళ్ల నిర్మాణం చేసుకోవాలని ఇందుకు వామపక్షాలుగా అండగా నిలుస్తామన్నారు. మరోవైపు శెట్టిపల్లి రైతులు 30 శాతం భూమి అయిన ఇవ్వాలని కోరుతున్నా వారి గోడు పట్టించుకునే పరిస్థితుల్లో లేరని, శెట్టిపల్లె భూమిపై వ్యాపారమే పరమావధిగా ప్రభుత్వ వ్యవహార శైలి ఉందని ఆరోపించారు. శెట్టిపల్లి రైతులకు, ఫ్లాట్ లో కొనుగోలుదారులను ఇబ్బందులకు గురి చేస్తే చరిత్ర హీనులుగా మిగులుతారని అధికార పార్టీకి హెచ్చరికలు చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ శెట్టిపల్లి రైతులు నుండి కష్టపడి పోగు చేసుకున్న సొమ్ముతో ఫ్లాట్లు కొనుక్కొని సొంతింటి కలను నెరవేర్చుకోవాలని అనుకుంటే ఏళ్ల తరబడి ఇలా మనోవేదనకు గురి చేస్తున్నారని, ఈ క్రమంలోనే చాలామంది ఆశలు వదులుకొని తనువు చాలించారన్నారు. నెలలో అధికార యంత్రాంగం శెట్టిపల్లె భూ సమస్యను పరిష్కరించాలని, ఇక ఓపిక పట్టే ప్రసక్తే లేదని అధికారులకు తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు,ఎస్ఎఫ్ ఐ నాయకులు మాధవ కష్ణ, సిఐటియు నగర అధ్యక్షులు మునిరాజా, సిపిఎం నాయకులు వై. శ్రీనివాసులు, బిటిఆర్ కాలనీ శాఖ కార్యదర్శి బాదుల్లా, లోకయ్య, హమాలి యూనియన్ నాయకులు శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, శెట్టిపల్లి భూ బాధితుల సంఘం నాయకులు కష్ణ, రాధాకష్ణ, డప్పుసూరి, ఎన్ డి రవి, కేతారి రాధాకష్ణ, శివ, పద్మనాభ రెడ్డి, శివకుమార్, మోహన్ రెడ్డి, ఎంవీఎస్ మూర్తి, నాగరాజు, మణి తదితరులు పాల్గొన్నారు.




భూబాధితులకు అండగా పునాదులు తవ్వుతున్న కె.నారాయణ

'స్వామీ' నీకో దండం..!

డిప్యూటీ సిఎంపై సొంతగూటిలో వ్యతిరేకత
నారాయణస్వామిపై నిరసనగా 'ఆవేదన' సభలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'స్వామీ నీకో దండం.. ఓట్లేసి నిన్ను ఎన్నుకోవడం మేం చేసిన తప్పు.. పార్టీ అధికారంలోకి వచ్చిందని సంతోషమే గానీ, ఏనాడూ ఏమీ సంపాదించుకున్నది లేదు.. మాకు సహకరించినది లేదు. ఇక నువ్వు పోటీ చేస్తే గెలిపించుకునే ఓపిక మాకు లేదు. టిడిపి నేతలు నిన్ను ఎన్ని విమర్శించినా మేం అడ్డుగా నిలిచాం.. అలాంటి మాపైనే కేసులు పెడతావా..?' అంటూ 12 పేజీల లేఖను పెనుమూరు మండలానికి చెందిన వైసిపి నాయకులు నారాయణస్వామికి పంపారు. జీడీనెల్లూరు నియోజకవర్గంలో రెండు దఫాలుగా నారాయణస్వామిని గెలిపిస్తూ వచ్చారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత నారాయణస్వామికి ఊహించని పదవి వరించింది. ఏకంగా డిప్యూటీ సిఎం, మంత్రి పదవి ఇచ్చారు. దీంతో కార్యకర్తలందరూ సంబరపడ్డారు. ఇక తమకు అడ్డే లేదని కేరింతలు కొట్టారు. అయితే నారాయణస్వామి స్వలాభం చూసుకున్నారు తప్ప, కార్యకర్తల శ్రేయస్సు కోరలేదన్నది వారి ఆక్రోశం. పెనుమూరు, జీడీనెల్లూరు, వెదురుకుప్పం మండలాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల మధ్య తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇటీవల వెదురుకుప్పం మండలంలో ప్రారంభోత్సవానికి వెళితే 'గో బ్యాక్ నారాయణస్వామి' అని బ్యానర్లు కట్టారు. జీడీనెల్లూరులో దళితులకు, రెడ్డి సామాజికవర్గం మధ్య తగాదా వస్తే పరిష్కరించాల్సింది పోయి 'రెడ్డి' సామాజికవర్గంపై కేసులు పెట్టించారని వారు మండిపడుతున్నారు. తమ ఊళ్లోకి రావద్దు అంటూ డిప్యూటీ సిఎంను అడ్డుకున్నట్లు సమాచారం. ఇపుడు పెనుమూరు మండలంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నారాయణస్వామికి నిరసనగా ఆవేదన సభ పెట్టి జగన్‌కు నారాయణస్వామి గురించి చెప్పాలని, వచ్చే ఎన్నికల్లో సీటిస్తే గెలిపించబోమని సమావేశమయ్యారు. ఏదిఏమైనప్పటికీ సొంత గూటిలోనే ఎదురుగాలి వీస్తోందనడంలో ఏమాత్రం సందేహం లేదు.




నారాయణస్వామికి వ్యతిరేక గ్రూప్ సమావేశం

కెనరా బ్యాంకు ఏటిఎం మూసివేత

అధికారుల తీరుపై ఖాతాదారుల ఆగ్రహం

ప్రజాశక్తి -సత్యవేడు

తిరుపతి జిల్లా సత్యవేడు కెనరా బ్యాంకు ఏటీఎం మిషన్ గదిని మూసి వేశారు. బ్యాంకులో తగినంత నగదు లేకపోవడం వల్ల తత్కాలికంగా ఏటీఎంను మూసే పరిస్థితి వస్తున్నట్లు సమాచారం. అయితే ఏటీఎం మిషన్ నిర్వహణలో సంబంధిత కెనరా బ్యాంకు అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై పలువురు ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించాలని కెనరా బ్యాంకు యాజమాన్యం ఏటీఎం మిషన్లను ఏర్పాటు చేసింది. తద్వారా ఖాతాదారులు తమ అవసరానికి 24 గంటల్లో ఎప్పుడైనా ఏటీఎం మిషన్ వద్దకు వెళ్లి అవసరం మేరకు నగదును డ్రా చేసుకోవచ్చు. దీంతోపాటు బ్యాంకు వేళల్లో సైతం రద్దీని నియంత్రించడానికి ఏటీఎం మిషన్లు అన్నివేళలా పనిచేసేటట్టు చూడాల్సిన బాధ్యత కెనరా బ్యాంక్ అధికారులపై ఉందనడంలో సందేహం లేదు. అయితే ప్రస్తుతం కెనరా బ్యాంకు ఎటిఎం ఎప్పుడు పని చేస్తుందో ఎప్పుడు పనిచేయదో తెలియని పరిస్థితి ఏర్పడింది. పైగా కెనరా బ్యాంకులో తగినంత నగదు నిల్వలు లేనప్పుడు కూడా ఏటీఎం మిషన్ను మూసివేస్తున్నారు. తరచూ ఇలాంటి పరిస్థితి చోటు చేసుకోవడం వల్ల ఖాతాదారులు పలు ఇబ్బందులకు గురి అవుతున్నారు.ఇందులో భాగంగానే గురువారం ఉదయం 11 గంటల బ్యాంకు సమయంలోనే ఏటీఎం మిషన్ గదిని మూసివేయడం ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై సంబంధిత కెనరా బ్యాంక్ మేనేజర్ వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు దారి తీస్తోంది. ఇప్పటికైనా సంబంధిత కెనరా బ్యాంక్ ఉన్నతాధికారులు స్పందించి 24 గంటల పాటు కెనరా బ్యాంకు ఏటీఎం సేవలు సక్రమంగా అందేలా చొరవ చూపాలని పలువురు ఖాతాదారులు కోరుతున్నారు.



ఆర్‌టిసి కంట్రోలర్లకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ తిరుపతి జిల్లా బస్ స్టేషన్ మేనేజర్లు, కంట్రోలర్లకు శిక్షణా తరగతులను గురువారం నిర్వహించారు. స్థానిక ప్రజా రవాణా శాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్ఎం తిమ్మాడి చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రయాణీకులకు మెరుగైన సేవలను అందించాలన్నారు. అలాగే బస్‌స్టేషన్‌లో ప్రయాణీకులకు ఎప్పటికప్పుడు బస్సుల సమాచారం తెలియజేయాలని, బసు స్టేషన్లు పరిశుభ్రంగా ఉంచుకోవడం, మంచినీటి సదుపాయం కలిగజేయడం, ప్రయాణీకులతో మంచి సంబంధాలు ఏర్పాటు చేసుకోవడం, బస్ స్టేషన్లోని దుకాణాల్లో ఎంఆర్‌పి ధరలకే వస్తువులు అమ్ముతున్నారా లేదా తెలుసుకోవాలని, వాటిని క్రమబద్ధీకరించాలని సూచించారు. బస్టాండులో పని చేస్తున్న సిబ్బంది తప్పనిసరిగా యూనిఫాంలో రావాలని, గుర్తింపు కార్డులు ధరించాలని, టెలిఫోన్లు పని చేస్తున్నాయో లేదో తెలుసుకుని, వాటిని ఎప్పటికప్పుడు పునరుద్దరించాలని తెలిపారు. బస్ స్టేషన్లో లైట్లను సమయానికి వేసుకుని అవసరం లేనప్పుడు లైట్లు ఆపి విద్యుత్‌ను ఆదా చేయాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిటిఎం బాస్కర్‌రెడ్డి, రామచంద్ర నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఈవో

ప్రజాశక్తి - తిరుమల

డయల్ యువర్ ఈవో కార్యక్రమం శుక్రవారం ఉదయం 9 నుండి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరగనుంది. ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలను, సూచనలను టిటిడి ఈవో ఎవి.ధర్మారెడ్డికి ఫోన్ ద్వారా, నేరుగా మాట్లాడి తెలుపవచ్చు. ఇందుకు భక్తులు సంప్రదించవలసిన నెంబరు 0877-2263261.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి


రాజమండ్రి న్యాయవాది సుభాష్ పై రాజమండ్రి పోలీసులు జరిపిన దౌర్జన్య కాండ, డిల్లీలో వీరేంద్ర కుమార్ అనే న్యాయవాది దారుణ హత్యకు వ్యతిరేకంగా న్యాయవాదుల ఐక్యవేదిక పిలుపు మేరకు స్థానిక న్యాయవాదులు గురువారం కోర్టువిధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు పొన్నేపల్లి వెంకటా చలపతి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి న్యాయవాదుల మతికి కారుకులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు వారి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వేడుకగా శ్రీమారుతి ఆస్పత్రి ప్రారంభం

సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలన్నీ ఒకే గొడుగు కిందకు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతి స్మార్ట్‌సిటిలో అత్యాధునిక సౌకర్యాలతో నూతనంగా ఏర్పాటు చేసిన 100 పడకల శ్రీమారుతి హస్పిటల్‌ను ప్రముఖ సినీ హీరోలు మంచు మోహన్‌బాబు, మంచు విష్ణు, మంచు మనోజ్ గురువారం ప్రారంభించారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండు సమీపంలోని మినర్వాగ్రాండ్ హోటల్ పక్కన ఏర్పాటు చేసిన ఆసుపత్రి వద్ద హీరో మోహన్‌బాబు మాట్లాడుతూ గత 9 సంవత్సరాలుగా అతి తక్కువ ఖర్చుతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న శ్రీమారుతి ఆస్పత్రి మరో అడుగు ముందుకువేసిందన్నారు. అత్యాధునిక సాంకేతిక నైపుణ్యంతో నూతనంగా శ్రీమారుతి 100 పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ప్రపంచ దేశాలను అతలకుతలం చేసి ప్రజలను భయాందోళనకు గురి చేసిన కరోనా సమయంలో శ్రీమారుతీ ఆసుపత్రి ఎంతో మంది పేదలకు ప్రాణం పోసిందని గుర్తు చేశారు. హైదరాబాదు వంటి నగరాల్లోనూ ఇలాంటి అత్యాధునిక సౌకర్యాలు గల ఆసుపత్రులు చాలా తక్కువన్నారు. బహుశా తిరుపతిలో ఇలాంటి ఆసుపత్రి ఇదే మొదటిది అయి ఉంటుందన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా స్థాపించిన శ్రీమారుతి నూతన హాస్పిటల్ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. ఎంఎల్‌ఏ భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి, రాయలసీమ వాసులకు గుండెకు సంబంధించిన అత్యాధునిక కేథలాబ్‌ను అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా, నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో అన్ని విభాగాలను ఒక్క చోటకు తీసుకురావడం ఆనందించదగ్గ విషయమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ అన్ని వైద్య సేవలను ఆరోగ్యశ్రీలోకి తీసుకొచ్చారన్నారు. తిరుపతి మెడికల్ హబ్‌గా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇలాంటి ఆసుపత్రులు రావడం శుభపరిణామం అన్నారు. హాస్పిటల్ ఎమ్‌డి డాక్టరు మారుతికృష్ణ మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీని దృష్టిలో ఉంచుకుని తిరుపతి, రాయలసీమ ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలను అత్యాధునిక వసతులతో అందజేయాలనే ఉద్దేశంతో నూతనంగా శ్రీమారుతి హాస్పిటల్‌ను ప్రారంభించామన్నారు. అందులో బాగంగానే రాష్ట్రంలో ఎక్కడ లేని విదంగా గుండెకు సంబంధంచిన అత్యాధునిక కాథలాబ్ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కరోనా సమయంలో ఎంతో మంది రోగులు ఊపిరితిత్తుల వ్యాధితో మరణించారాన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాయలసీమలో ఇప్పటి వరకు ఎక్కడా లేని విధంగా ఊపిరిత్తులలో ఉన్న చీము గడ్డలు, నిమ్ము గడ్డలను తొలగించి, ఊపిరితిత్తులకు స్టంట్ కూడా వేసే అత్యాధునిక పరికరాలను శ్రీమారుతి హాస్పిటల్‌లో ఏర్పాటు చేశామన్నారు. ఆసుపత్రికి రోగి ఎలాంటి క్లిష్టపరిస్థితుల్లో వచ్చిన వైద్యం అందించే విధంగా 24 గంటలు ఐసియును లేటెస్ట్ టెక్నాలజీతో ఏర్పాటు చేశామన్నారు. కార్డియాలజి, న్యూరాలజీ, నెఫ్రాలజి, ఆర్థోపెడిక్స్, జనరల్ సర్జరీ, జనరల్ ఎడిసిన్, పల్మనాలజీ, క్రిటికల్ కేర్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వంటి విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చామన్నారు. ఆర్యోగశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం, ఆరోగ్యశ్రీ లేని వారికి కూడా అతితక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామన్నారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయరు డాక్టరు శిరీషా, డిఎంహెచ్‌వో డాక్టరు శ్రీహరి, బర్డ్ హాస్పిటల్ మాజీ డైరెక్టర్ డాక్టరు జగదీష్, ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టరు దగ్గుమాటి శ్రీహరిరావు, మాజీ ఎంఎల్‌ఏ సుగుణమ్మ, టిడిపి నాయకులు పులివర్తి నాని పాల్గొన్నారు.



ఆస్పత్రి ప్రారంభోత్సవ వేడుకల్లో సినీ నటుడు మోహన్‌బాబు



'పోణకా దంపతులకు సత్కారం'

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు పట్టణంలోని కరణాల వీధికి చెందిన వైసీపీ నేత పోణకా శివకుమార్ రెడ్డి నివాసానికి ఉపాధ్యాయ నియోజక వర్గం ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్ర శేఖర్ రెడ్డి చేరుకొని స్వచ్ఛంద్ర సంస్థ చైర్పర్సన్ పోణకా దేవసేనమ్మ , శివకుమార్ రెడ్డి లను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల , తదితర అంశాల పై చర్చించారు. అనంతరం ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి పోణకా దంపతుల ను శాలువా కప్పి సన్మానించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని వారికి అందించారు. అలాగే ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి ని పోణకా దంపతులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పర్వతరెడ్డి రాణా , ప్రమోద్ , రామ మోహన్ రెడ్డి , అజయ్ కుమార్ , దయాకర్ రెడ్డి , శ్రీకాంత్ రెడ్డి , రవికుమార్ , తదితరులు పాల్గొన్నారు.

మానవత్వానికి మరో చిహ్నం 'రంగారెడ్డి'

ప్రజాశక్తి - క్యాంపస్

సమాజంలోని బడుగు, బలహీన వర్గాలకు మానవత్వంతో చేయూతని అందించే మరో రూపం, మరో చిహ్నంగా కనిపించే వ్యక్తి ఆచార్య అంగడి రంగారెడ్డి అని ఆర్థిక శాస్త్రం విశ్రాంత ఆచార్యులు ఆచార్య కేఎం. నాయుడు పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఆర్థిక శాస్త్ర విభాగం, ఐఐపిఏ తిరుపతి లోకల్ బ్రాంచ్, రాయలసీమ ఎకనమిక్స్ అసోసియేషన్, మహిళా అధ్యయన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఆర్థిక శాస్త్ర సీనియర్ విశ్రాంత ఆచార్యులు ఆచార్య అంగడి రంగారెడ్డి ఆకస్మిక మతికి సంతాప సభను మహిళా విద్యా విభాగంలోని సెమినార్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆచార్య అంగడి రంగారెడ్డి రాయలసీమ ఎకనమిక్ అసోసియేషన్ స్థాపించడానికి ముఖ్య కారకుడని, ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ అసోసియేషన్ లో, ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ లో సభ్యులుగా కీలక పాత్ర వహించారన్నారు. ఆచార్య ఎంసీ. రెడ్డప్పరెడ్డి, ఆచార్య డి. హిమాచలం, ఆచార్య కే.శాంతకుమారి, ఆచార్య టి. లక్ష్మమ్మ, ఆచార్య డి. కష్ణమూర్తి, ఆచార్య శమంతకమణి, ఆచార్య బి. రామచంద్రారెడ్డి, ఆచార్య పి. కోదండరామిరెడ్డిలు పాల్గొన్నారు.

'సమాధులతోట'లో మరుగుదొడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు రెండో పట్టణ పరిధిలోని గాంధీనగర్ లో గూడూరు ఇంటర్ డినామినేషనల్ క్రిస్టియన్ సెమెట్రీ సొసైటి ఆధ్వర్యములో సమాధులు తోట యందు నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించారు. సొసైటీ అధ్యక్షులు వులా రవికుమార్ మాట్లాడుతూ సమాధుల తోట నందు మౌలిక వసతులకు సొసైటీ కషిచేయడం అభినందనీయమన్నారు. నీటి వసతి కూడా కల్పించామన్నారు. ప్రార్ధనల కొరకు సంగీత వాయిద్యములు కూడ సమాధులు తోటలో ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ఈస్టర్ పండుగ సందర్భముగ ఉదయం 4 గంటలకు ప్రత్యేక ఆరాధన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు టీ. కుమార్ , ప్రధాన సలహాదారులు రెవరెండ్ లూథర్ బాబు పాస్టర్. అబ్రాహాము (ట్రెజరర్), పాస్టర్ ప్రభుదాసు (సెక్రటరీ) పాస్టర్ మండే రవికుమార్ (జాయింట్ సెక్రటరీ)పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం

పుత్తూరు టౌన్ : మండలంలోని నేసనూరు గ్రామ పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భవతికి సూపర్‌వైజర్ గీతాంజలి, కార్యకర్త ధనమ్మ ఆధ్వర్యంలో సీమంతం చేశారు ఆరోగ్యసూత్రాలను వివరించారు. ప్రతినెలా ఆస్పత్రికి వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సలహాలు పాటించి మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అపుడే ఆరోగ్యంగా పిల్లలు పుడతారన్నారు. ప్రతినెలా అంగన్‌వాడీ కేంద్రంలో పాలు, గుడ్లు, మంచి ఆహారం పెడతారని తెలిపారు. మహిళా పోలీసు వాణి, వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా పులివర్తి వినీల్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ప్రకాశం భవనం ఎదురుగా టిడిపి చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ పులివర్తి నాని కుమారుడు పులివర్తి వినిల్ జన్మదిన వేడుకలు టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి ఆర్కే నాయుడు, నాగేంద్రబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకష్ణనాయుడు మాట్లాడుతూ పేద ప్రజల కోసం నిరంతరం తెలుగుదేశం జెండా పట్టుకుని పేద ప్రజల సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ సమస్య పరిష్కారమే దిశగా నిరంతరం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారం వైపు అడుగులేస్తున్న యువ నాయకుడు పులివర్తి వినీల్ అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు బిసన్న, మహేష్, శివ, రవి పాల్గొన్నారు.

బియ్యపు పాలనలో అభివృద్ధి శూన్యం : బొజ్జల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి/తొట్టంబేడు

ఎమ్మెల్యేగా బియ్యపు మధుసూదన్ రెడ్డి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో చేసిన అభివద్ధి శూన్యమని, బొజ్జల అభివద్ధి తప్పా బియ్యపు పనితీరు ఎక్కడా కానరలేదని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి విమర్శించారు. ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమంలో భాగంగా రెండో రోజైన గురువారం తొట్టంబేడు మండలం పూడి పంచాయతీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటి ప్రచారంలో ప్రజల నుంచి పలురకాల సమస్యలు ఆయన దష్టికి వచ్చాయి. పూడి ఎస్సీ కాలనీలో మంచం పట్టిన ఓ ముసలవ్వ తన ఫించను రద్దు చేశారని మొరపెట్టుకుంది. ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అది చేశా, ఇంత చేశానని గొప్పలు చెబుతున్నారనీ, పల్లెలకు వస్తే ఎక్కడ చూసినా సమస్యలే దర్శనమిస్తున్నాయని ఏద్దేవా చేశారు. గాలి చలపతి నాయుడు, గాలి మురళీనాయుడు, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన 'అల్లు అర్జున్' అభిమానులు

గూడూరు రూరల్ : ఈ నెల 8న తేదీన అల్లు అర్జున్ జన్మదినాన్ని పురస్కరించుకొని పలు పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు అల్ ఇండియా అల్లు అర్జున్ ఫాన్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా రెండవరోజైన గురువారం జడ్పి హై స్కూల్ ప్రాంతంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం అన్నదానం, శనివారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలు విజయవంతం చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో బన్నీశివ, శివగణేష్, మణికంఠ, సుమంత్, హర్ష, వెంకీ, వినీత్, పూర్ణ, గంగాధర్, అఖిలేషు పాల్గొన్నారు.



బకాయిల వసూళ్లకు ప్రాధాన్యతివ్వండి

సమీక్షా సమావేశంలో సిఎండి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఎపిఎస్ పిడిసిఎల్ పరిధిలో వినియోగదారులకు మెరుగైన సేవలందించడంతోపాటు వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేసేందుకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు అధికారులకు సూచించారు. అలాగే బకాయిల వసూళ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఎపిఎస్ పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో గురువారం సంస్థ పరిధిలోని చీఫ్ ఇంజనీర్లు, జనరల్ మేనేజర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి సంతోష రావు మాట్లాడుతూ రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కు దరఖాస్తు చేసిన వెంటనే సర్వీసులను మంజూరు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసులను సకాలంలో మంజూరు చేయని అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు సంబంధించి కాలిపోయిన నియంత్రికలను వేసవి తీవ్రత దష్ట్యా పంటలకు నష్టం వాటిల్లకుండా తక్షణం మార్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పగటిపూట 9 గంటల విద్యుత్తును సరఫరా చేయాలన్నారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో విద్యుత్ వ్యవస్థను పటిష్టవంతం చేయడంద్వారా వినియోగదారులకు మెరుగైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జగనన్న కాలనీల విద్యుదీకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. సంస్థ పరిధిలో పేరుకు పోయిన విద్యుత్ బకాయిలను వసూలు చేసేందుకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. సంస్థ పరిధిలోని కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల పరిధిలో విద్యుత్ పంపిణీ నష్టాలు ఎక్కువగా వున్న ఫీడర్లను గుర్తించి, నష్టాలను తగ్గించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వినియోగదారులకు మరింత మెరుగైన, సత్వర సేవలందించేందుకు వీలుగా అధునాతన సాంకేతికతతో కాల్ సెంటర్ ను ఆధునీకరించడం జరిగిందని, విద్యుత్ అంతరాయాలు, సమస్యలపై టోల్ ఫ్రీ నంబరు: 1912కు కాల్ చేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

నూతన పంథాలో సమీక్ష

ఎపిఎస్‌పిడిసిఎల్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని సంస్థ సిఎండి కె. సంతోష రావు నూతన పంథాలో నిర్వహించారు. కార్పొరేట్ కార్యాలయం నుంచి చీఫ్ జనరల్ మేనేజర్లు తమ విభాగానికి సంబంధించిన వివరాలతో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వగా, ఐదు జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్లు తమ జిల్లాలకు సంబంధించిన వివరాలను ప్రెజెంటేషన్ రూపంలో వెల్లడించారు. సంస్థ పరిధిలో వివిధ అంశాలపై సీఎండీ క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో లోటుపాట్లు, వాటిని అధిగమించేందుకు అవసరమైన సలహాలు, సూచనలను సిఎండి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిస్కమ్ డైరెక్టర్ (టెక్నికల్ అండ్ హెచ్ఆర్ డి) ఎన్.వి.ఎస్. సుబ్బరాజు, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) కె. శివప్రసాద రెడ్డి, చీఫ్ జనరల్ మేనేజర్లు డి.ఎస్. వరకుమార్, వి. సురేష్, డి.వి. చలపతి, పి. అయూబ్ ఖాన్, కె. గురవయ్య, వై. లక్ష్మీ నరసయ్య, విజయకుమార్ రెడ్డి, కె.ఆర్.ఎస్. ధర్మజ్ఞాని, జాయింట్ సెక్రటరీ ఎ. రాధా జయశ్రీ, ఓఎస్ డి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

వడమాలపేట మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా విద్యా శాఖ అధికారి శేఖర్‌తో కలిసి జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి. ఆకస్మిక తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. గురువారం వడమాలపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి వివరాలు తెలుసుకుని ఇన్విజిలేటర్లకు పలు సూచనలు చేసారు. పరీక్షా కేంద్ర ఆవరణంలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ



బయటి వ్యక్తులను ఎవరినీ అనుమతించరాదని చీఫ్ సుపరింటెండెంట్‌ను ఆదేశించారు, తాగు నీరు ఏర్పాటు, ఎఎన్ఎం ప్రథమ చికిత్స మందులు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవడం తదితర అంశాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలలో, పరీక్ష కేంద్రంలో పరిశుభ్రత వంటి వాటిని సరిగా అమలు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి ఎట్టి పరిస్థితిలో సెల్ ఫోన్లు అనుమతించరాదని చీఫ్ సూపరింటెండెంట్ ను ఆదేశించారు. బాలుర కేంద్రంలో 118 మంది గురువారం పరీక్షకు హాజరయ్యారు.

'నక్షత్ర బిల్డర్స్'తో సొంతింటి కల సాధ్యం

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

సొంతింటి కలను సాకారం చేసుకోవడానికి నక్షత్ర బిల్డర్స్ అండ్ డెవలపర్స్ మంచి అవకాశాన్ని కల్పిస్తోందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ భరత్ రెడ్డి తెలిపారు. గురువారం కన్‌స్ట్రక్షన్ కార్యాలయంలో 'ప్రజాశక్తి'కి ప్రాజెక్టు వివరాలను తెలిపారు. ఆధ్యాత్మిక క్షేత్రంగా దినదినాభివద్ధి చెందుతున్న తిరుపతి నగరంలో మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో నక్షత్ర బిల్డర్స్ అండ్ డెవలపర్స్ నిర్మిస్తున్న కాస గ్రాండే సామాన్య మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ధర నిర్ణయించి వారి సొంత ఇంటి కల సాకారానికి తమ వంతు సహకారాన్ని అందిస్తోంది. అద్భుతమైన ముఖద్వారంతో మల్టీపర్పస్ హాల్, చిన్నారులకు ఆకట్టుకునే ఆటస్థలం, క్లబ్ హౌస్, అబ్బురపరిచే పార్కులతో తీర్చిదిద్దుతున్నామన్నారు. నగరం మధ్యలో ఇటు రైల్వే స్టేషన్, బస్టాండ్, ఎయిర్పోర్ట్‌కు సమీపంలో ఉండటంతో అందరికీ అందుబాటులో నూతన ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోందన్నారు. 100 శాతం వాస్తు ప్రకారం నిర్మాణం సాగుతుందని , కొత్త ల్యాండ్ మార్క్ ఇన్ క్లబ్ హౌస్ ఆమ్యూనిటీస్ వరల్డ్ క్లాసుతో 2 బిహెచ్ కె, ఫోర్ బెడ్ రూమ్ డూప్లెక్స్ 3 బి హెచ్ కె బెడ్ రూమ్ కి బుకింగ్ ప్రారంభించామన్నారు. నగర ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుకింగ్ కోసం సెల్ నెంబర్లు 9418572222 సంప్రదించాలని కోరారు.



ఎస్వీయూలో 'విరంచి ఫ్లాష్ మాబ్'

ప్రజాశక్తి - క్యాంపస్

ఇంజినీరింగ్ విద్యార్థులకు వినూత్న ఆలోచనలు, ఐడియాలు 'విరంచి' వంటి ప్రోగ్రామ్‌ల ద్వారా అలవడతాయని ఉపకులపతి ఆచార్య కె. రాజారెడ్డి పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థినీలు ఫ్లాష్ మాబ్ కార్యక్రమాన్ని పరిపాలన భవనం ఎదుట గురువారం నిర్వహించారు. జాతీయస్థాయి కల్చరల్ ఫియస్టా విరంచి 2కె23 ప్రచారం చేయడంలో భాగంగా ఈ ఫ్లాష్ మాబ్ ను విద్యార్థినిలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా విచ్చేసిన ఉప కులపతి ఆచార్య కె. రాజారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజనీ, ఎస్ఒఈటి డైరెక్టర్ ప్రొఫెసర్ పి. మల్లికార్జున యూనివర్సిటీలోని ఎన్టీఆర్ విగ్రహం ఎదుట ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు చెందిన విద్యార్థులు చురుగ్గా పాల్గొని పోటీతత్వ స్ఫూర్తితో ప్రదర్శనలు ఇచ్చారు. ప్రతి ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచి ప్రేక్షకులను ఆకర్షించింది. విరంచి ఫ్యాకల్టీ కన్వీనర్ ఎ. సుప్రియ, కో-కన్వీనర్ ఆర్.ప్రియ దర్శిని అధికారులకు కతజ్ఞతలు తెలుపుతూ విరించి 2కె23ని గ్రాండ్‌గా సక్సెస్ చేయాలని అందరినీ ఆహ్వానించారు.



ఘనంగా స్ప్రింగ్ బోర్డ్ అకాడమి వార్షికోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కీలకపాత్ర పోషించాలనీ మేయర్ శిరీష అన్నారు. తిరుపతి నగరంలోని స్థానిక మహతి ఆడిటోరియంలో స్ప్రింగ్ బోర్డ్ అకాడమీ మొదటి వార్షికోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా ముఖ్య అతిథులను వేదిక పైకి ఆహ్వానించి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివినటువంటి విద్యార్థులు భవిష్యత్తు బంగారు భవిష్యత్తుగా మారుతుందని, ఈ ఇన్నోవేషన్ కాలంలో టెక్నాలజీకి తగ్గట్టుగా మనం మారాలని, పిల్లలందరూ పై స్థాయిలో ఉండాలన్నారు. మోహన్ బాబు యూనివర్సిటీ రిజిస్ట్రార్ సారథి,స్ప్రింగ్ బోర్డు డైరెక్టర్ అరవింద్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పుడు నుంచే భక్తిశ్రద్ధలతో విద్యను అభ్యసించాలని ప్రతి ఒక్క విద్యార్థి ఉన్నత చదువులు చదివి గొప్ప స్థాయిలో ఉండాలని కోరుకుంటున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె అరుణకుమారి, మంచు విష్ణు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సునీల్ చక్రవర్తి, ఏవో హేమాద్రి నాయుడు పాల్గొన్నారు.

శ్రీ సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి -కోట మండలంలోని గూడలి గ్రామంలోని మహిమాన్వితమైన శ్రీ కామాక్షి దేవి సమేత శ్రీ సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం అంకురార్పణతో ప్రారంభం అయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం వేద పండితులు శ్రీ కామాక్షి దేవి సమేత శ్రీ సంగమేశ్వర స్వామికి పంచామతాభిషేకం, మహన్యాస రుద్రాభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రతి ఏటా ఏప్రిల్ మాసంలో నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 5 నుంచి 15 వరకు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల గురించి ఆలయ ప్రధాన అర్చకులు కార్తీక్ శర్మ వివరించారు.ధర్మకర్త మాలేపాటి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాల ఏర్పాట్లను చేపడుతున్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : PUTTUR
E.P. NO. 9 / 2022
In
O.S.NO. 137/2012

BETWEEN:
N.S.Madhavan .... D.Hr/Plaintiff
And:
K. Vasudevan ......J.Dr/Defendant

NOTICE TO THE JUDGEMENT DEBTOR

To
K. Vasudevan, S/o K.Sriramulu
Padiga, Bopparajupalem Village,
Narayanavanam Mandal,
Tirupati District.
Sir,

Please Take Notice that the D.Hr filed the above Execution Petition for realization of E.P. amount against you; You are intentionally evading to receive the notice through court process, if you have got any objection you may appear before this Hon'ble Court at 10.30 A.M on 24-04-2023 either in person or through an advocate and file your objection, If you fail to do so the matter will be decided exparte.

// By court order //
V. M.NARENDRA KUMAR,
V.M.N.KUMAR,
G. GURUNATH,
ADVOCATES: PUTTUR

IN THE COURT OF THE ADDITIONAL JUNIORCIVIL JUDGE
-CUM-
JUDICIAL FIRST CLASS MAGISTRATE: PUTTUR
O.S. NO. 46 / 2021 & I.A.NO.245 / 2021

BETWEEN:
Anusuyyam @ B. Anusuya ....Plaintiff
And:
Smt. M. Thulasi and others ......Defendants

Summon / Notice to the Defendants

To
1. M. Thulasi W/o Late M. Ramanadham @ Ramanadhaiah, 2. M. Balaji S/o late M. Ramanadham @ Ramanadhaiah, 3. M. Madhu Kumar S/o late M. Ramanadham @ Ramanadhaiah, 4. M. Latha D/o late M. Ramanadham @ Ramanadhaiah, all are residing at Door No. 20-1-449/4C, Maruthi Nagar, Korlagunta, Tirupati Town, Post and Urban Mandal, Tirupati District.
Madam/Sir,

Please Take summon/Notice that the Plaintiff filed the above suit for recovery suit debt against you; you are intentionally evading to receive the suit summon through court process, if you have got any objection you may appear before this Hon'ble Court at 10.30 A.M on 17-04-2023 either in person or through an advocate and file your objection, If you fail to do so the matter will be decided exparte.

// By court order//
B.V. CHALAPATHI,
ADVOCATE, PUTTUR

మహారాజశ్రీ అవనిగడ్డ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

HMOP 41/2022

Between:-
ఉప్పాల విజయలక్ష్మి అనే తానికొండ విజయలక్ష్మి D/o ఉప్పాల ప్రసాద రావు, ఘంటసాల పాలెం, ఘంటసాల మండలం, కృష్ణా జిల్లా. ...పిటీషనర్
మరియు
తానికొండ రంజిత్ S/o ముని రాజు, Door 4-87/C7, గ్రౌండ్ ఫ్లోర్, సత్యసాయి నగర్, కేనరాయన గుట్ట, తిరుపతి రూరల్ మండలం, చిత్తూరు జిల్లా. ...రెస్పాండెంట్

పై నెంబరులో పిటీషనర్, రెస్పాండెంటు పై DIVERCE కొరకు పై కోర్టులో పిటీషను దాఖలు చేయగా సదరు పిటీషను లో రెస్పాండెంటుకు DIVERCE నోటీసు నిమిత్తం ది.13-04-2023వ తేదీన వాయిదా అయివున్నది. కావున సదరు రెస్పాండెంటు ది.13-04-2023వ తేది ఉదయం 10-30ని॥లకు పై కోర్టువారి యెదుట హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలియపరచుకోవలెను. లేని యెడల పరోక్షమందు తీర్మానించబడును.

వల్లభనేని రామారావు,యు.కామ్, ఎల్.ఎల్.బి.,
దామెర్ల శివ నాగరాజు,
పిటీషనరు తరపు అడ్వకేట్స్.



అమ్మవారి సేవలో హీరో అల్లరి నరేష్

తిరుచానూరు : శ్రీ పద్మావతి అమ్మవారిని గురువారం ప్రముఖ సినీ హీరో 'అల్లరి' నరేష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయం వద్ద ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, ఇన్స్పెక్టర్లు ప్రసాద్, అశోక్, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్న సినీ హీరో 'అల్లరి ' నరేష్ కి వేదపండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నెలాఖరుకల్లా సర్వేరాళ్లు నాటాలి : జేసీ

తిరుపతి టౌన్ : జిల్లాలో ఫేస్ 1కి సంబంధించిన సర్వే రాళ్లు నాటే ప్రక్రియను ఏప్రిల్ 30కల్లా యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, సర్వే అధికారులతో రీ సర్వే, ఒటిఎస్, సర్వే రాళ్ల నాటే ప్రక్రియ, మ్యూటేషన్, అసైన్‌మెంట్ ల్యాండ్స్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం నుంచే జిల్లాలో రోజువారి ప్రణాళికలతో సర్వేరాళ్లు నాటే ప్రక్రియను సంబంధిత అధికారులు దృష్టి పెట్టి పూర్తి చేయాలన్నారు. సర్వేరాళ్లు సచివాలయం స్టాక్ పాయింట్ వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఒన్ టైం సెటిల్‌మెంట్ పథకానికి సంబంధించి ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసే పనులపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కోదండరామి రెడ్డి, భాస్కర్ నాయుడు, ఏ.డి. సర్వేయర్ జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

పార్లే అగ్రో సరికొత్త పానీయం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

పార్లే అగ్రో సంస్థ సరికొత్తగా 'స్మూద్ ఫ్రూట్ స్మూతీస్' పానీయాన్ని మార్కెట్లోకి ప్రవేశపెట్టినట్లు ఆ సంస్థ జాయింట్ డైరెక్టర్, సిఎంవో నదియా చౌహాన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రుచికరమైన పండ్లు, పెరుగుతో వివిధ రకాల ఆహ్లాదకరమైన రుచులలో స్మూద్ ఫ్రూట్ స్మూతీస్ పానీయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. దక్షిణాది మార్కెట్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా దుల్కర్ సల్మాన్‌ను ప్రకటించామన్నారు. భారతదేశం పాడి పరిశ్రమను ఇష్టపడే దేశమని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని స్మూద్ ఫ్లేవర్డ్ మిల్క్ స్మూద్ డెయిరీ బ్రాండ్ను మరో అసాధారణమైన స్మూద్ ఫ్రూట్ స్మూతీస్ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వినియోగదారులకు రూ.10 ధరతో వివిధ రకాల ప్రత్యేమైన రుచులతో పానీయాన్ని ఆస్వాదించాలని సూచించారు. భారతీయ వినియోగదారుల కోసం మరిన్ని గుడ్ ఫర్ యు ఉత్పత్తులను పరిచయం చేయాలనే ఉద్దేశంతో దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో దుల్కర్ సల్మాన్ ఆ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రైనేజి సమస్య పరిష్కరించాలి

క్యాంపస్ : ఎస్వీ యూనివర్సిటీ గర్ల్స్ హాస్టల్ వన్‌లో డ్రైనేజి సమస్యను పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చిన్న డిమాండ్ చేశారు. హాస్టల్ ముందు గురువారం నిరసన తెలిపారు. డ్రైనేజి పైప్‌లైన్ పగిలిపోయి బాత్రూమ్స్ నుంచి నీరు హాస్టల్ బయటకు వస్తూ దుర్వాసన వస్తోందన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ అధ్యక్షులు సుందర్‌రాజు, టెక్నికల్ వింగ్ కార్యదర్శి చంద్ర, నవీన్, యువప్రసాద్, రంజిత్ పాల్గొన్నారు.

కూలి గిట్టుబాటు ఉండాలి : ఎంపిడిఓ

బాలాయపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు కూలి గిట్టుబాటు అయ్యేలా చూడాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఉందని ఎంపీడీఓ స్వరూప రాణి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కామకూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి పనులకు సంబంధించి అక్రమాలకు పాల్పడితే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇక పనులు వద్ద కూలీలకు అన్ని వసతులు ఏర్పాటు చేసేలా ప్రత్యేకమైన చర్య చేపట్టాలని టెక్నికల్ అసిస్టెంట్లకు ఆదేశించారు. ఆమె వెంట ఏపీఓ హరినాథ్ ,ఈసీ సుబ్రహ్మణ్యం, ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు ఉన్నారు.



IN THE COURT OF SENIOR CIVIL JUDGE : PUTTUR
A.S. NO. 21 / 2020
In
O.S.NO. 46/2014 on the file of Principal Junior Civil Judge Puttur

BETWEEN:
Galla Lakshmaiah ....Appellant/Defendant No.9
And:
K. Venkatesh and others ......Respondents

Appeal Suit Summon to the RespondentNo.1

To
K. Venkatesh, S/o Nadhamuni, Hindu, aged about 23 years, Cultivation and Business, Residing Vedurukuppam village and Mandal, Chittoor District, now residing at D.No.20-5-85/B, Sanjay Gandhi Colony, Korlagunta,Tirupati within the Jurisdiction of Principal Junior Civil Judge Court, Tirupati.
Sir,

Please Take appeal suit summon that the Appellant has filed the above appeal suit against the Decree and Judgement in O.S. No. 46/2014 on the file the Principal Junior Civil Judge Court , Puttur and you are intentionally evading to evading to receive the appeal suit summon through court process, if you have got any objection you may appear before this Hon'ble Court at 10.30 A.M on 28-04-2023 either in person or through an advocate and file your objection, If you fail to do so the matter will be decided exparte.

// By court order//
D. SESHACHALAM,
ADVOCATE/NOTARY
PUTTUR, CELL : 9440934553.